స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పండుగ శుభాకాంక్షలు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న భీమ్‌భరత్

రాజేంద్రనగర్: రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆదివారం భోగి సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి భీమ్‌భరత్, రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు నరేశ్‌లు కలిసి బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో వ్యాపారాలు !



అత్తాపూర్ నుంచి లంగర్‌హౌజ్‌కు వెళ్లే రహదారిలో ఇలా..

అత్తాపూర్: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డు మార్గంలో ఎవరికివారు ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్తాపూర్ నుంచి లంగర్‌హౌజ్ బ్రిడ్జి వైపు వెళ్లే మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కారు బైక్ వాషింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇరుకైన రోడ్డు మార్గంలో వాహనాలు వెళ్లాలంటే ఇబ్బంది పడుతుంటే ఇసుకలారీలు, వాషింగ్‌సెంటర్‌కు వచ్చే భారీ వాహనాలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మూసీ సరిహద్దులను నిర్ధారించకపోవడంతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారే విమర్శలున్నాయి. ఈ మేరకు సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సత్తాచాటిన రెజ్లర్లు



పతకాలను సాధించిన రాష్ట్ర రెజ్లర్లు

మణికొండ: దక్షిణాది స్థాయిలో జరిగిన సీనియర్ రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున జట్టు పాల్గొని అత్యధిక పతకాలను సాధించి సత్తా చాటింది. తమిళనాడులోని ఈరోడ్‌లో ఈనెల 10వ తేదీ నుంచి 13వ వరకు జరిగిన దక్షిణ భారత సీనియస్ రెజ్లింగ్ పోటీల్లో అత్యధిక పతకాలను సాధించి ఓవరాల్ చాంపియన్‌గా రాష్ట్ర జట్టు నిలిచింది. ఏకంగా 4 పసిడి, 10 రజతం, 11 కాంస్య పతకాలను సాధించి అగ్రభాగంలో నిలిచిందని కోచ్‌లు శ్రీకాంత్‌యాదవ్, నర్సింగ్‌రావు, సన్నీ, శ్రీనుకుమార్‌లు తెలిపారు. ఈనెల 31నుంచి మహారాష్ట్ర పూణేలో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పసిడి, రజతం సాధించిన వారు పాల్గొంటారని వివరించారు. పతకాలు సాధించిన వారిలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలానికి చెందిన క్రీడాకారులే ఉన్నారని, వారందరినీ కోచ్‌లు అభినందించారు.

కేలండర్ ఆవిష్కరణ



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో వెంగళి నర్సింహా, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గోపిక కృష్ణ, గోపి రమేష్, బండారి శ్రీనివాస్, బండారి వేణు, వెంగళి మహాదేవ్, చలపతి, సగ్గం రాజు, బాబిని విట్టల్, ఎర్వ సత్యనారాయణ, కసిగారి యాదగిరి, రాపోలు సత్తయ్య, కొంపల్లి జగదీష్, శేఖర్ తదితరులున్నారు.

అయ్యప్ప సన్నిధిలో గానామృతం



మణికొండ: మణికొండకు చెందిన గాయకుడు మణికంఠ బాబుకు స్వామివారి దర్శనంతో పాటు అయ్యప్ప సన్నిధిలో పాటలు పాడే అవకాశం దక్కింది. కేరళ ప్రభుత్వం దేవాలయం ఆవరణలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భక్తులు అధికంగా వచ్చే రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. తెలుగు రాష్ట్రాల నుంచి కూడా గాయకులను ఎంపిక చేసి అయ్యప్ప భక్తిగీతాలను పాడిస్తుంది. మణికంఠ బాబు స్వయంగా గాయకుడు కావటం, మణికంఠ భజన బృందం పేరుతో మహాపడి పూజలలో పాటలు పాడుతుంటారు. ఆదివారం సాయంత్రం శబరిమలలో ఆయనకు పాడే అవకాశం రావడంతో తెలుగు భక్తులు తన్మయత్వం చెందేలా స్వామి సన్నిధిలో పాటలు పాడి అలరించారు.

దొంగతనాల నివారణకు చర్యలు



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్

శంషాబాద్ రూరల్ : దొంగతనాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శంషాబాద్ పోలీసులు ప్రచారం చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఊరికెళ్లే సమయంలో ఇంట్లో విలువైన నగలు, నగదును ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. ఇంటికి తాళం వేసి బయటికి వెళ్తే.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు చుట్టుపక్కల వారు గమనించేలా చూసుకోవాలన్నారు. సెక్యూరిటీ అలారంతో పాటు మోషన్ సెన్సార్, ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌ను అమర్చుకోవాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

భోగి మంటలు..
సంక్రాంతి సందడి

మణికొండ: మూడు రోజుల సంక్రాంతి పండుగ సందర్భంగా మొదటి రోజు ఆదివారం భోగి మంటలు వేసి చలి కాచుకోవటంతో పాటు పాత వస్తువులను మంటల్లో వేసి నూతన కాలానికి స్వాగతం పలికారు. మహిళలు ఇళ్ల ముందు రంగు,రంగుల రంగవల్లులను వేసి పండుగ శోభ తీసుకొచ్చారు. సంక్రాంతి పండుగను స్వస్థలాల్లో నిర్వహించుకునేందుకు ఇప్పటికే అత్యధికంగా ప్రజలు గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. దీంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని రోడ్లు, షాపులు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచే మహిళలు రంగవల్లులు వేయటం, గృహాలను అలంకరించుకోవటం, గృహాలలో ప్రత్యేక పూజలు చేసుకున్నారు. పండుగకు అనేక రకాల పిండివంటలను సిద్ధం చేసుకున్నారు. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండగలను ఘనంగా నిర్వహించేకునేందుకు అంతా సిద్ధమయ్యారు.

యువకుల ఉత్సాహం..

అత్తాపూర్ : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో యువకులు ఉత్సాహంతో డీజేలు ఏర్పాటు చేసుకుని గాలిపటాలు ఎగురవేశారు. బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో స్నేహితులు, పార్టీ కార్యకర్తలతో కలిసి పతంగులు ఎగురవేస్తూ.. చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కృపేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, పీఎం ప్రశాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుడాకాలనీలో భోగి మంటలు

గంగిరెద్దుల విన్యాసాలు..

రాజేంద్రనగర్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గంగిరెద్దుల విన్యాసాలు రాజేంద్రనగర్ సర్కిల్‌లో కనువిందు చేశాయి. ఆదివారం భోగి పండుగ సందర్భంగా తెల్లవారుజాము నుంచే గంగిరెద్దులను ఇళ్ల వద్దకు తీసుకొచ్చి విన్యాసాలు చేయించారు. భోగి సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భోగి మంటలను వేసి ప్రజలు భోగి పండుగను ఘనంగా చేసుకున్నారు. అనంతరం చిన్నారులకు తలంటూ స్నానాలకు చేయించి భోగిపళ్లను వేసి చిన్నారులకు హారతులిచ్చారు. శివారు ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు గంగిరెద్దులను తీసుకొచ్చి కాలనీలు, బస్తీలతో పాటు అపార్టుమెంట్‌లలో విన్యాసాలు చేయించి అనంతరం కానుకలను స్వీకరించారు. భోగి సందర్భంగా మహిళలు తమ ఇళ్ల ఎదుట వివిధ రంగులతో అందమైన ముగ్గులు వేశారు. యువకులు, చిన్నారులు గాలిపటాలను ఎగరవేస్తూ సందడిగా గడిపారు.

ఖానాపూర్‌లో సంక్రాంతి ఉత్సవం..

మణికొండ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ సంక్రాంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్త, సహకార్యవాహ వరకాల కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్య భగవానుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్ని సంక్రాంతి పండగగా నిర్వహించుకుంటామన్నారు. మన పండగలు ప్రకృతి ఆధారంగానే చేసుకుంటామని, ప్రతి పండగకు వాతావరణంలో మార్పు కనిపిస్తుందన్నారు. రైతుల ఇంటికి ధాన్యం రావడం, పశు,పక్ష్యాదులను పూజించి వాటికి మంచి ఆహారాన్ని ఇచ్చే కాలమన్నారు. భవిష్యత్ రోజుల్లో మనదేశం విశ్వగురువుగా ఎదగడంతో పాటు రామరాజ్య పరిపాలన కొనసాగుతుందన్నారు. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని మనమంతా చూడటం గర్వించదగ్గ పరిణామన్నారు. ఈనెల 22న ప్రతి ఒక్కరూ హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయటంతో పాటు ఇళ్లలో ఐదు దీపాలను వెలిగించాలన్నారు. గోల్కొండ భాగ్ గేటెడ్ కమిటీ ప్రముఖ్ మలిపెద్ది శంకర్‌జీ, నార్సింగి బస్తీ ప్రముఖ్ విశ్వనాథ్‌జీ, గోల్కొండ భాగ్ సహాగోష్ ప్రముఖ్ రాజేష్ పరాన్కర్, నార్సింగి నగర కార్యవాహ మన్నె సురేష్, నాయకులు బండి శంకర్, పుప్పాల మల్లేష్, రవీందర్, సోమయాజులు, నరేష్, ఓదెల సత్యనారాయణ, సందీప్‌రెడ్డి, శివరాజ్, పోచయ్య తదితరులున్నారు.



మణికొండ శివపురికాలనీలో సంక్రాంతి ముగ్గుతో మహిళ



నార్సింగిలో గాలిపటాలతో సందడి..



శివాజీనగర్ కాలనీలో..



గంగిరెద్దుతో చిన్నారులు



సంక్రాంతి సంబరాల్లో పతంగులతో..



సంక్రాంతి ఉత్సవంలో స్వయం సేవకులు

కార్వాన్‌లో రాహుల్‌గాంధీకి మద్దతుగా ర్యాలీ



గోల్కొండ: ప్రజల హక్కుల పరిరక్షణతో పాటు వారికి న్యాయం కల్పించేందుకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్‌హజరీ అన్నారు. రాహుల్‌గాంధీకి మద్దతుగా ఆదివారం ఆయన తాళ్లగడ్డ చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం రాహుల్ గాంధీ చేపట్టిన యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమలో నాయకులు దుర్గాప్రసాద్, నర్మద, ఖాజా సైఫుద్దీన్, అమ్జద్‌అలీఖాన్, రాజేందర్‌యాదవ్, శ్రీనివాస్, నవీన్‌సింగ్, లక్ష్మణ్, వంశీ తదితరులున్నారు.

అభినందనలు



గోల్కొండ: చెన్నైలో ఇటీవలే ముగిసిన 11వ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళా విభాగంలో మౌనిక సత్తా చాటింది. సీనియర్ మహిళల విభాగంలో మౌనికకు కాంస్య పథకం వచ్చింది. ఈ సందర్భంగా ఆమెను ఆదివారం కార్వాన్ సబ్జిమండీ గంగపుత్ర సంఘం భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నర్సింగ్‌రావు ఆమెను అభినందించారు. మౌనిక సబ్జిమండిలోని గంగపుత్ర సంఘంలోని వీరాభిమన్యు రెజ్లింగ్ క్లబ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు మౌనికకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. కోచ్ కట్ట శ్రీనివాస్, నన్నిబాబు, శ్రీకాంత్, కుమార్ తదితరులున్నారు.

పాతబస్తీలో పార్లమెంట్ వేడీ



ఈ నెల 12న మక్కా మసీదులో ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌ను సన్మానిస్తున్న నమాజీలు

చార్మినార్: పాతబస్తీలో అప్పుడే పార్లమెంట్ ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ఎంఐఎం, ఎంబీటీ పోటాపోటీగా ప్రజా సమస్యలంటూ బస్తీలను చుట్టేస్తున్నారు. బస్తీలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. తాము ఇప్పటికే బలంగా ఉన్నప్పటికీ..ఏ చిన్న అవకాశాన్ని ఇతర పార్టీలకు ఇవ్వరాదని భావిస్తున్న హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ పాతబస్తీలోని పార్టీ నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. ఇక ఎంబీటీ ఈసారి హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయడానికి సిద్ధపడిన ఈ పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ ఇప్పటికే తన ప్రయత్నాలను మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 12న శుక్రవారం మక్కా మసీదులో జరిగిన సామూహిక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఇప్పటికే ఈ నెల 5న, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మక్కా మసీదులో జరిగిన సామూహిక ప్రార్థనలలో పాల్గొని స్థానిక బస్తీల ప్రజలను పలకరించగా.. స్థానిక ప్రాంతాలకు చెందిన ముస్లిం యువకులు ఆయనను కలిసి కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. సాధారణంగా రంజాన్ పండుగ సందర్భంగానే రాజకీయ పార్టీల నాయకులు మక్కా మసీదులో జరిగే యౌముల్ ఖురాన్ సభల సందర్భంగా పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. ఇక 12న శుక్రవారం మక్కా మసీదులో జరిగిన జుమ్మా ప్రార్థనలలో ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లా ఖాన్ పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది.

స్వల్ప ఓట్లతో ఓటమి..

ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికలలో యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి కేవలం 878 ఓట్ల తేడాతో పరాజయం పొందిన అంజదుల్లాఖా న్ పార్లమెంట్ ఎన్నికలపై కన్నేసారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎంఐఎం, ఎంబీటీ పార్టీలు పోటాపోటీగా పాతబస్తీలో పర్యటిస్తున్నారు. జుమ్మా ప్రార్థనలలో ఎంబీటీ నాయకులు పాల్గొనడంతో చర్చనీయాంశంగా మారింది.

దేవర కరుణాకర్ సేవలు వెలకట్టలేనివి

గోల్కొండ: గుడిమల్కాపూర్ బీజేపీ మాజీ కార్పొరేటర్ దేవర కరుణాకర్ సేవలు వెలకట్టలేనివని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకుడు దేవర వంశీ ఆదివారం గుడిమల్కాపూర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బీజేపీ నాయకులు రాధాకృష్ణ, దేవర శ్రీనివాస్, దేవర వంశీ, తదితరులున్నారు.

మజ్లిస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

గోల్కొండ: మజ్లిస్ నాయకులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో పలువురు మజ్లిస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు తమ కమిటీ పరిధిలో ఉన్న బస్తీలు, కాలనీల్లో ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలు తెలుసుకోవాలని ఆయన అన్నారు. డ్రైనేజీ, తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తాయని అవి తన దృష్టికి తేవాలన్నారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికి సరైన సలహాలు, సూచనలు అందించాలని ఆయన అన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

చార్మినార్: చార్మినార్ చౌక్ మైదాన్‌లోని బాలాజీ ఆలయంలో ఆదివారం సాయంత్రం గోదా దేవీ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ మహోత్సవంలో స్థానిక భక్తులతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు. అర్చకులు అలంకార బ్రహ్మ ఆత్రేయాచార్యులు గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు కృషి

అబిడ్స్: టీటీడీ ఆధ్వర్యంలో నిరంతరం ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు ప్రత్యేక కృషి చేస్తామని టీటీడీ అడ్వైజరి కమిటీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఆయనను పలు సంఘాల వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూసుఫ్‌గూడ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మెట్టు రాఘవేంద్ర మాట్లాడుతూ..టీటీడీ ఆధ్వర్యంలో తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను చాటేందుకు నిరంతరం పలు కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు, భక్తి భావాలు పెంపొందించేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు

చార్మినార్: రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర విజయవంతం కావాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ ఆదివారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారత్ జోడో న్యాయ్ యాత్ర దేశ రాజకీయాలను సమూలంగా మార్చేస్తుందన్నారు. కె.సురేష్ బాబు, శ్రీనివాస్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

అత్తాపూర్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి వైన్‌షాపు వద్ద మృతి చెందాడు. అత్తాపూర్ ఎస్సై లింగం, ఏఎస్సై రషీద్‌మియా తెలిపిన వివరాల ప్రకారం... తాజ్‌హోటల్ హసన్‌నగర్‌లో నివసించే మహ్మద్ జహంగీర్ (51) కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరికి నలుగురు పిల్లలు సంతానం. కాగా రోజూ ఉదయం, సాయంత్రం తోసులను విక్రయిస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత 20 ఏళ్లుగా మద్యానికి బానిసగా మారిన అతడు పిల్లర్ నంబరు 178 వద్ద ఉన్న ఓ వైన్స్ షాప్ ఆవరణలో ఆదివారం మద్యం తాగి అక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న ఇంటింటా అయోధ్య సంబరాలు



అబిడ్స్: ఈ నెల 22న ప్రతి ఇంటా అయోధ్య సంబరాలు చేపట్టాలని గన్‌ఫౌండ్రీ బీజేపీ కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ పేర్కొన్నారు. అయోధ్యలో రామ మందిర్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి ఇంటా దీపావళి సంబరాలు చేయాలన్నారు. ఆదివారం రంగోళి వేడుకలను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. అనంతరం భీశ్వ సురేఖ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించి దీపావళి శోభను తలపించే విధంగా వేడుకలు చేయాలన్నారు. అన్నివర్గాల ప్రజలు 500 సంవత్సరాల నాటి ఆలయ ప్రారంభానికి ఎదురు చేస్తున్నారన్నారు. అయోధ్యలో రామాలయం ప్రారంభమైన వెంటనే దేశం సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉంటుందన్నారు.